క్లుప్తంగా

బాలపోలేరమ్మ ఆలయంలో ఎంపీ పూజలు


ఆలయంలో ఎంపీ గురుమూర్తి

ఏర్పేడు: మండలంలో పెనుమల్లంలోని బాల పోలేరమ్మ ఆలయంలో తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి గురువారం సాయంత్రం పూజలు చేశారు. గ్రామస్తులు విరాళాలతో ఈ ఆలయాన్ని నిర్మించి కుంభాభిషేక పూజలు చేశారు. గ్రామస్తుల ఆహ్వానంపై ఎంపీ ఆలయాన్ని సందర్శించారు. ఆయనను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో రమేష్, ప్రసాద్, విజయ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కోసం బ్యాంకు వద్ద కిటకిట


సప్తగిరి గ్రామీణ బ్యాంకు వద్ద నగదు తీసుకుంటున్న మహిళా రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ: రైతులకు పంట పెట్టుబడి కోసం ప్రోత్సాహకం కింద ఇస్తున్న రైతు భరోసా సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం రైతుల బ్యాంకు ఖాతాలతో జమ చేయడంతో నగదు కోసం గురువారం స్థానిక సప్తగిరి గ్రామీణ బ్యాంకు వద్ద బారులు తీరారు. మండలంలోని 5,270 మంది రైతులకు రూ.3.97 కోట్లు రైతు భరోసా పథకం కింద మంజూరైంది. దీంతో రైతుల అకౌంట్లు ఎక్కువగా సప్తగిరి బ్యాంకులో ఉండడంతో నగదు కోసం క్యూ కట్టారు. నగదు తీసుకుని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

హెచ్ఎంగా రమణయ్య


రమణయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక జెడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయులుగా రమణయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మండలంలోని కల్లివెట్టు జెడ్పీ హైస్కూలు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న హెచ్ఎం విజయకుమారి కేవీబీపురం మండలం కోవనూరు జెడ్పీ హైస్కూలుకు బదిలీపై వెళ్లారు.

సారె సమర్పణ


పెనుమల్లం బాలపోలేరమ్మ ఆలయంలో పవిత్రారెడ్డి

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, పెనుమల్లంలో బాలపోలేరమ్మ ఆలయాల్లో గురువారం కుంభాభిషేక పూజలు ఘనంగా చేశారు. బియ్యపు పవిత్రారెడ్డి స్వామి అమ్మవార్లకు చీర, సారె సమర్పించి పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచులు లలిత, చెంచులక్ష్మి, ఎంపీటీసీ మునిరాజా, మాజీ సర్పంచ్ తంబా సుబ్రమణ్యం, ధర్మకర్తలు నాగబత్తిబాబు, నాగమురుగప్ప, నాయకులు అర్జున్‌బాబు, రోశయ్య, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.


ఏర్పేడులో ఫాగింగ్

ఏర్పేడు: ఏర్పేడులోని అశోక్‌నగర్, పల్లివీధి, బజారు వీధిలో గురువారం సాయంత్రం ఫాగింగ్ చేశారు. సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య మాట్లాడుతూ, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వీధుల్లో కొళాయిలు, ఇళ్ల వద్ద మురుగునీటి నిల్వలేకుండా చూడాలని గ్రామస్తులను కోరారు. పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాలకు సిద్ధం

ఏర్పేడు: మండలంలోని అంజిమేడులో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవాలకు సిద్ధమయ్యాయి. శనివారం వీటిని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.17.5 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను నూతనంగా అన్ని హంగులతో నిర్మించారు.

పరామర్శ


ఢిల్లీబాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం, నేతలు

కేవీబీపురం: మండలంలోని ఆరె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త మూర్తి ఢిల్లీబాబును ఎమ్మెల్యే ఆదిమూలం గురువారం పరామర్శించారు. ఢిల్లీబాబు వారం క్రితం తీవ్ర అనారోగ్యానికి గురై, చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే ఆరె గ్రామానికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. ఆరోగ్యం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. అత్యవసరమైతే తనను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, పార్టీ నేతలు నందకుమార్ ,లాల్ బాబు యాదవ్, ఎంపీటీసీ మూర్తి సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

పద్మసరస్సులో పవిత్ర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



చక్రస్నానం..భక్తజన పరవశం


దేవేరులకు తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో చివరి రోజైన గురువారం పద్మ సరస్సులో చక్రత్తాళ్వార్‌తో కలిసి భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారు. సాయంత్రం ధ్వజావరోహణంతో ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి. వేకువ జామున 5 గంటలకు సుప్రభాత సేవతో నిత్యపూజా కైంకర్యాలను పూర్తి చేసిన అర్చకులు శ్రీవారి పల్లకీ సేవను మాడ వీధుల్లో నిర్వహించారు. అనంతరం శ్రీదేవీ, భూదేవీల సమేతుడైన వెంకటేశ్వరుడు ఊరేగింపుగా పద్మ సరస్సుకు చేరుకున్నారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య అర్చకులు చక్రత్తాళ్వార్‌తో కలిసి దేవేరులకు సుగంధ ద్రవ్యాలు, పాలు, పెరుగు, తేనె తదితర ద్రవ్యాలతో తిరుమంజనం పూర్తి చేశారు. 11.10 గంటలకు పద్మసరస్సులోని జలాలకు సంప్రోక్షణ తదితర కార్యక్రమాలను పూర్తి చేసిన అర్చకులు చక్రత్తాళ్వార్‌ను సరస్సులో మూడు మునకలు వేయించారు. భక్తులు సరస్సులో స్నానమాచరించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవమూర్తులకు ఆస్థానం నిర్వహించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. రాత్రి 7 గంటలకు విశ్వక్సేనుడుతో కలిసి దేవేరులు మాడవీధి ఉత్సవంలో పాల్గొన్నారు. ఆవాహనం చేసిన దిక్పాలకులకు ఉద్వాసన కార్యక్రమాన్ని పూర్తి చేసి గరుడాళ్వార్ చిత్రపటమున్న వస్త్రాన్ని ధ్వజస్తంభం నుంచి అవరోహణం చేయడంతో ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి. బ్రహ్మోత్సవాలను నిర్విఘ్నంగా నిర్వహించిన అర్చకులకు ఆలయ మర్యాదలతో గౌరవించారు. కార్యక్రమంలో ఏఈఓ మోహన్, ఆర్జితం అధికారి భరత్, షరాబ్ శ్రీనివాస షనాయ్, రూరల్ సీఐ సురేష్‌కుమార్, ఆలయ భద్రతా జమేదార్ రాజశేఖర్ తదితరులు పర్యవేక్షించారు.

వేడుకగా పుష్పయాగం


నాగలాపురంలో స్వామి, అమ్మవార్లకు పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

పిచ్చాటూరు: నాగలాపురం శ్రీ వేదనారాయణ స్వామి ఆలయంలో పుష్పయాగం గురువారం వేడుకగా నిర్వహించారు. ఉదయం నిత్య కైంకర్యాల అనంతరం అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత వేద నారాయణులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఏడాది కాలంలో సాధారణ సమయాలు, ఉత్సవ వేళల్లో తెలిసో తెలియకో జరిగిన దోష నివారణకు నిర్దేశించిన పుష్పయాగాన్ని మధ్యాహ్నం 3 గంటలకు ఆలయంలోని రాములవారి మండపంలో వేదమంత్రోచ్ఛరణల నడుమ చేశారు. సర్వభూపాల వాహనంపై ఉభయనాంచారీ సమేత వేద నారాయణులను ఆశీనులు చేసిన అనంతరం టీటీడీ అధికారులు, అర్చకులు సాంప్రదాయబద్ధంగా పుష్పాలను బుట్టలలో ఊరేగించి స్వామి చెంతకు చేర్చారు. అర్చకులు వైఖానస ఆగమశాస్త్రబద్ధంగా ఉత్సవమూర్తులను పుష్పాలతో అభిషేకించి, పుష్పయాగాన్ని పరిపూర్ణం చేశారు. రాత్రి సతులతో కలసి మత్స్యావతారమూర్తి తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఏర్పాట్లను టీటీడీ అధికారులు పర్యవేక్షించారు.

స్కూళ్లకు 'జగనన్న విద్యాకానుక' పంపిణీ


జగనన్న విద్యాకానుక కిట్లను స్కూళ్లకు తరలిస్తున్న ఎంఈఓ హేమమాలిని, సిబ్బంది

పిచ్చాటూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు గురువారం మండల విద్యాశాఖ అధికారులు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఎంఈఓ హేమమాలిని మాట్లాడుతూ, జగనన్న విద్యాకానుకకు సంబంధించి 3 జతల యూనిఫాం, టెక్ట్స్ బుక్స్, నోట్‌బుక్స్, ఆక్స్‌ఫర్డ్, పిక్టోరియల్ డిక్షనరీలు, బెల్టు, షూస్, సాక్స్, స్కూల్ బ్యాగులతో కలిపి స్కూళ్లకు చేరవస్తున్నట్టు చెప్పారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ తరగతి గదిలో విద్యార్థులు, తల్లిదండ్రుల సందర్శనార్థం జగనన్న విద్యాకానుక వస్తువులను ఉంచారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు, ఐఈఆర్‌టీలు పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీ

– ఒకరి పరిస్థితి విషమం

శ్రీకాళహస్తి: రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ఒక డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం అర్ధరాత్రి శ్రీకాళహస్తి పట్టణ శివారులోని పీస్‌రహదారిపై ఈఘటన చోటు చేసుకుంది. ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొన్నాయి. విశాఖపట్టణానికి చెందిన రాము(40) అనే డ్రైవర్ ప్రమాదానికి గురై లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. స్థానికులు గుర్తించి క్షతగాత్రుడిని తిరుపతి రుయాకు చికిత్స నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలకు కుట్టుమెషిన్లు పంపిణీ


కుట్టుమెషిన్లు అందుకున్న మహిళలు


కుట్టుకు సంబంధించి డిజైన్లను పరిశీలిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: ఎల్కో స్టీల్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళలకు కుట్టుమెషిన్లను గురువారం ఉచితంగా అందజేశారు. టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌పై పరిసర గ్రామాల మహిళలకు 100 రోజుల నైపుణ్యాభివృద్ధి కార్యక్రమంలో ఈసీఎల్ సీఎస్ఆర్ చొరవతో సిటిజన్ వెల్ఫేర్ ఫోరానికి చెందిన వృత్తి నిపుణులైన శిక్షకులతో శిక్షణ ఇచ్చారు. శిక్షణానంతరం మహిళలకు పరీక్ష నిర్వహించి అర్హులైన 20మందికి కుట్టు మెషిన్లు అందజేశారు. ఈసీఎల్- శ్రీకాళహస్తి యూనిట్‌లో కంపెనీ ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ పొందిన మహిళలు తమ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండవచ్చని, స్వయం ఉపాధితో నెలకు రూ.15వేల నుంచి రూ.18వేల వరకు సంపాదించుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు. త్వరలోనే మరో 30 మందికి శిక్షణ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సురేష్ ఖండేల్వాల్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు సాధికారత కల్పించేందుకు ఎల్కో స్టీల్ తన వంతు కృషి చేస్తోందన్నారు.

కాళంగి నది ఏటి పోరంబోకు భూ ఆక్రమణ నేరం


ఆక్రమణకు గురైన భూమిని పరిశీలిస్తున్న తహసీల్దారు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని చిన్నయిగుంట గ్రామ పంచాయతీ తహానగర్ గ్రామం వద్దనున్న కాళంగి నది ఏటి పోరంబోకు భూ ఆక్రమణ చట్టరీత్యా నేరమని తహసీల్దార్ హనుమాన్‌నాయక్ హెచ్చరించారు. ఆయన తహానగర్‌లో ఆక్రమణ పాలైన కాళంగి నది ఏటి పోరంబోకు భూమిని పరిశీలించారు. ఈ భూమిలో సాగు చేయరాదని రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు పెట్టిన సాగు చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళంగి నది ఏటి పోరంబోకు భూమి 276 సర్వే నంబరులో సుమారు 20 ఎకరాలను ఆక్రమించి సాగు చేయటం దారుణమన్నారు. కాళంగి నది కాలువను ఆక్రమించటం వలన నదీ ప్రవాహం గ్రామంలోకి వచ్చే ప్రమాదం ఉందని, వెంటనే ఆక్రమణలు తొలగించాలని వీఆర్ఓ భాస్కర్‌ను ఆదేశించారు. ఎవరైనా మళ్లీ ఆక్రమణకు యత్నిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాలికలను జూనియర్ కాలేజీలో చేర్పించాలని ప్రచారం


నెలవాయిలో విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అధ్యాపకులు

బుచ్చినాయుడుకండ్రిగ: పదవ తరగతి పాసైయిన విద్యార్థినులను స్థానిక జిల్లా పరిషత్ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్‌లో చేర్పించాలని గురువారం మండలంలోని నెలవాయి, వేణుగోపాలపురం, వెస్టువరత్తూరు, కల్లివెట్టు, తలారివెట్టు, గ్రామాల్లో అధ్యాపకులు ప్రచారం చేశారు. ఒక్కో గ్రూపులో 40 సీట్లు చొప్పున ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, గ్రూపులున్నాయని విద్యార్థినుల తల్లిదండ్రులకు తెలియజేశారు. కార్యక్రమంలో లెక్చరర్లు సురేంద్ర, రఘువీర్, మార్టిన్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చెల్లాతమ్మ తిరునాళ్ల


అమాసరెడ్డి కండ్రిగలో అమ్మవారి ఊరేగింపు

సత్యవేడు: మండలంలోని కొత్తమారికుప్పం పంచాయతీలో చెల్లాతమ్మ తిరునాళ్లు గురువారం వైభవంగా నిర్వహించారు. అలాగే అమ్మవారిని ఊరేగించారు. నీళ్లతొట్టి కండ్రిగ, అమాసరెడ్డి కండ్రిగ, క్రొమారికుప్పం, గంగుల కండ్రిగ, ముసలరాజు కండ్రిగ, దేగావారి కండ్రిగ, కొత్త కండ్రిగలలో అమ్మవారిని విశేషంగా పూలతో అలంకరించి ట్రాక్టరుపై ఊరేగించారు. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చారు.

పంచాయతీ ఈఓగా షణ్ముగం

నారాయణవనం: నారాయణవనం మేజర్ పంచాయతీ ఈఓగా షణ్ముగం గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలలో భాగంగా ఆయన రేణిగుంట మండలం తూకివాకం నుంచి ఇక్కడకు వచ్చారు. పంచాయతీ ఆదాయం పెంపునకు, అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

23 నుంచి కావమ్మ కథ

శ్రీకాళహస్తి: స్థానిక సంతమైదానంలోని శ్రీకావమ్మ ఆలయం వద్ద 23వ తేదీ నుంచి కావమ్మ కథ వైభవం చెప్పనున్నట్టు ఆలయ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కావమ్మ ఆలయంలోని శ్రీరామమందిరానికి కుంభాభిషేకం నిర్వహించి ఏడాది అయిన నేపథ్యంలో కావమ్మ కథ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 23న రూపాచిత్రణ, గొబ్బి పాటలు, వివాహం, 24న సారె సమర్పణ, 25న హోమగుండం, శాంతి పూజ, సాయంత్రం 6గంటలకు టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సంకీర్తనలు, హరికథ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలియజేశారు.

60 ఏళ్ల నాటి కల దాసుకుప్పం బైపాస్ రోడ్డు


దాసుకుప్పం బైపాస్ రోడ్డు సర్వే పనుల పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

- రోడ్డు సర్వే పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం
- భూ నిర్వాసితులను ఆదుకుంటామని హామీ

పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గ ప్రజల 60 ఏళ్ల నాటి కల దాసుకుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. గురువారం కారణి–దాసుకుప్పం బైపాస్ రోడ్డు సర్వే పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. రోడ్డు విస్తరించిన 2 కిలోమీటర్లలో హద్దురాళ్లను ఆర్అండ్‌బీ, రెవెన్యూ ఉన్నతాధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రస్తుతం తమిళనాడు మీదుగా వెళ్తున్న మార్గానికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం ఈ బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.26 కోట్లు మంజూరు చేసిందని గుర్తు చేశారు. ఆంధ్ర–తమిళనాడు విభజన నుంచి నియోజకవర్గ ప్రజలు సత్యవేడు వైపు వెళ్లాలంటే తమిళనాడులో కిలోమీటరు దూరం వెళ్లాల్సి వస్తోందని, ఇందుకోసం సత్యవేడు ఆర్టీసీ డిపో తమ వాహనాలకు తమిళనాడు పర్మిట్ కింద ఏటా రూ.44 లక్షలు చెల్లిస్తోందన్నారు. రెండేళ్ల క్రితం వచ్చిన కరోనా సమయంలో మన రాష్ట్ర వాహనాలు తమిళనాడు మీదుగా వెళ్లడానికి ఆ ప్రభుత్వం నిరాకరించిందని, ఆ సమయంలో నియోజకవర్గ ప్రజలు పడిన బాధలు వర్ణనాతీతమన్నారు. ఇంత ప్రతిష్టాత్మకమైన రోడ్డు నిర్మాణాన్ని గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, రోడ్డు ఆవశ్యకతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తాను వివరించిన వెంటనే రూ.26 కోట్లు మంజూరు చేశారని, ఈ పనులు పూర్తయితే మన రాష్ట్ర పరిధిలోనే నియోజకవర్గం అంతటా తిరగవచ్చని, ఏటా పర్మిట్ కింద తమిళనాడుకు చెల్లించే రూ.44 లక్షలు ప్రభుత్వానికి ఆదా అవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తమకు న్యాయం చేయాలని కొందరు సురుటుపల్లెకు చెందిన మహిళలు రోడ్డుపై బైఠాయించారు. న్యాయం చేస్తామని పోలీసులు, ఎమ్మెల్యే నచ్చజెప్పడంతో ఆందోళనను విరమించారు.

రైతులు సహకరించాలి : ఎమ్మెల్యే

కారణి–దాసుకుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఆ ప్రాంత నిర్వాసిత రైతులు సహకరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. పార్టీలక అతీతంగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పనులు వేగవంతానికి సహకరించాలని కోరారు. భూ సర్వే పనులు వేగవంతంగా పూర్తి చేసేలా చూడాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డిని ఫోన్‌లో ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈ ధనంజయ రెడ్డి, సత్యవేడు, నాగలాపురం తహసీల్దార్లు శ్రీదేవి, ప్రసన్నకుమార్, శ్రీ పళ్లికొండేశ్వరాలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, మండల వైఎస్ఆర్ సీపీ కన్వీనర్ అపరంజిరాజు, ట్రేడ్ యూనియన్ చైర్మన్ ఎస్ఎం సురేష్, దాసుకుప్పం సర్పంచ్ రవిరెడ్డి, రెవెన్యూ, ఆర్అండ్‌బీ ఏఈ ఇజ్రాయెల్, రెండు మండలాల సర్వేయర్లు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు


దుకాణదారులకు అవగాహన కల్పిస్తున్న న్యాయవాది రాజేశ్వరరావు

శ్రీకాళహస్తి: బాలలను పనిలో పెట్టుకుంటే చట్టపరంగా చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని న్యాయవాది రాజేశ్వరరావు హెచ్చరించారు. బాలకార్మిక నిర్మూలన మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని భేరివారి మండపం పరిసర దుకాణాల వారికి బాలకార్మిక నిర్మూలన చట్టంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, పేద ప్రజలు కొందరు కుటుంబ పోషణ నిమిత్తం కోసం తమ పిల్లలను పనులకు పంపిస్తుంటారన్నారు. అయితే వారికి ప్రభుత్వం పేదలకు ఇచ్చే పథకాలను వివరించి, పిల్లలను పాఠశాలలకు పంపేలా చైతన్యవంతుల్ని చేయాలన్నారు. ఇక ఏ న్యాయ సమస్య ఉన్నా అర్జీ రూపంలో న్యాయమూర్తికి ఇస్తే తక్షణమే పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామన్నారు. న్యాయ సలహాల కోసం 15100ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత పెరిందేశం


పెరిందేశం జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న లాయర్ విజయ్ కిరణ్, వైస్ ఎంపీపీ సరస్వతి

కేవీబీపురం: కళత్తూరులో 20 రోజులుగా జరుగుతున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో పెరిందేశం విజేతగా నిలిచింది. గురువారం నిర్వహించిన ఫైనల్స్‌లో కళత్తూరు–పెరిందేశం జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన పెరిందేశం జట్టు నిర్దేశిత 12 ఓవర్లకు 11 2 పరుగులు భారీ స్కోరు చేసింది. అనంతరం భారీ లక్ష్యం ఛేదనకు బ్యాటింగ్ చేసిన కళత్తూరు జట్టు విజయం వరకూ వచ్చి ఓటమి పాలైంది. కేవలం 5 పరుగుల తేడాతో పెరిందేశం విజయం సాధించింది. విన్నర్స్ పెరిందేశం జట్టుకు గ్రామానికి చెందిన న్యాయవాది విజయ్ కిరణ్, వైస్ ఎంపీపీ సరస్వతి, ట్రోఫీతో పాటు విన్నర్స్, రన్నర్స్ జట్లకు నగదు బహుమతులు అందజేశారు. పోటీల్లో ప్రతిభ చాటిన పెరిందేశం, కళత్తూరు ఆటగాళ్లు బత్తెయ్య, రాజేంద్ర, చిన్నా, వంశీ, దావీద్, సంపత్, అరుణ్, షాహీద్, ప్రభు, ఫిరోజ్, అజిత్‌లను అభినందిస్తూ జ్ఞాపికలను అందజేశారు. ఇదే గ్రౌండ్‌లో వరుసగా రెండోసారి పెరిందేశం జట్టు విన్నర్స్ ట్రోఫీని దక్కించుకోవడం విశేషం!

నిమజ్జనంతో ముగిసిన గంగ జాతర


నిమజ్జనానికి తరలివెళ్తున్న గంగమ్మ

పిచ్చాటూరు: పిచ్చాటూరులో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న గంగ జాతర గురువారం సాయంత్రం గంగమ్మ నిమజ్జనంతో ముగిసింది. బుధవారం అర్ధరాత్రి అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. పట్టణం అంతా తిరిగి గురువారం ఉదయం 10 గంటలకు నడి వీధిలో గంగమ్మను కొలువుదీర్చారు. గ్రామోత్సవంలో మేళ తాళాలు, విద్యుత్ దీపాలంకరణలు ఆకర్షణగా నిలిచాయి. సాయంత్రం స్థాయిక బ్రహ్మం గారి గుడి నుంచి కుంభాన్ని గ్రామ పెద్దలు, మహిళలు ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. వివిధ వేషధారణలతో భక్తులు ఆకట్టుకున్నారు. ఏర్పాట్లను ఆలయ సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.

దారి దోపిడీ కేసులో ముగ్గురి అరెస్టు

వరదయ్యపాళెం: వాహనాన్ని ఆపి డ్రైవర్‌పై దాడి చేసి దోపిడీకి పాల్పడిన కేసులో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ అరుణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. పార్థిబన్ అనే డ్రైవర్ ఈ నెల 6న లారీలో శ్రీకాళహస్తి సమీపంలోని ల్యాంకో కంపెనీ నుంచి ఐరన్ ముడి సరుకు తీసుకుని చెన్నైకి బయలుదేరాడన్నారు. కదూరు మీదుగా సత్యవేడు రోడ్డులో వెళ్తుండగా అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో సత్యవేడు మండలం అమాసరెడ్డికండ్రిగకు చెందిన ధనుష్, పెద్దఈటిపాకంకు చెందిన చరణ్, తడ మండలం బోలింగాలపేటకు చెందిన నవీన్ రెండు ద్విచక్ర వాహనాలపై లారీని వెంబడించి రాళ్లకుప్పం సమీపంలో అడ్డగించారని పేర్కొన్నారు. డ్రైవర్‌పై దాడి చేసి రూ.5 వేలను దోపిడీ చేశారని తెలిపారు.

లారీ డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామన్నారు. ఈ క్రమంలో రాచకండ్రిగ బస్టాప్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ధనుష్, చరణ్, నవీన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా దోపిడీకి పాల్పడింది తామేనని అంగీకరించారని వెల్లడించారు. వారి నుంచి రూ.3,500, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని సత్యవేడు కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

రైల్వే ప్రమాదం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే

- బాబుకు ఓట్లేస్తే బీజేపీకి వేసినట్టే..!
- మాజీ కేంద్రమంత్రి డాక్టర్ చింతామోహన్


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్

రేణిగుంట: ఒడిశా రాష్ట్రంలో జరిగిన ఘోర రైల్వే ప్రమాదానికి నరేంద్రమోదీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని మాజీ కేంద్రమంత్రి డాక్టర్ చింతామోహన్ అన్నారు. రేణిగుంటలో గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రపంచస్థాయిలో ఇంతటి రైల్వే ప్రమాదం ఎప్పుడూ జరగలేదన్నారు. ఈ ప్రమాదంలో వెయ్యి మందికి పైగా అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతే కేంద్రం తప్పుడు లెక్కలు చూపుతోందని ఆరోపించారు. రైల్వేశాఖను ప్రైవేటుపరం చేయడం, అలాగే సిగ్నలింగ్ సిస్టమ్‌ను కూడా ప్రైవేటు సిబ్బంది చేతుల్లో ఉంచడమే దీనికి కారణమని పేర్కొన్నారు. బీజేపీ, టీడీపీ కుమ్మక్కై డ్రామాలు ఆడుతున్నాయన్నారు. చంద్రబాబుకు వేసే ప్రతి ఓటు బీజేపీకి వేసినట్లేనన్నారు. రాష్ట్రంలో చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. మన్నవరం ప్రాజెక్టును కేంద్రం పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు.

క్లుప్తంగా

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

ఏర్పేడు: మండలంలోని పాయిల్‌సెంటర్ గ్రామవాసి తుపాకుల చిన్నక్క(47) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆదేశంపై గున్నేరి కిషోర్‌రెడ్డి బుధవారం ఆ గ్రామానికి వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.5 వేలను అందజేశారు. సర్పంచ్ కృష్ణయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు మధు యాదవ్, శివమ్మ, వెంకటేశ్వర్లు, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



ఏర్పేడు: మండలంలోని ఎండీపుత్తూరులో బుధవారం సర్పంచ్ మోహనప్రియ, తిరుపతి మాధురి రెమిడి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. 150 రోగులకు బీపీ, షుగర్, కీళ్లు, ఎముకలు, వెన్నెముక, జనరల్ మెడిసిన్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్లు ఎస్‌ఎం కుమార్, అమూల్య, వినిత, ప్రజ్ఞ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సామ్రాట్ అక్కలకోట మహరాజ్ పాదుకల దర్శనం

శ్రీకాళహస్తి: పట్టణంలోని న్యాయవాది రాజేశ్వరరావు ఇంటికి బుధవారం శ్రీసామ్రాట్ అక్కలతోట మహరాజ్ వారి పాదుకలు భక్తుల దర్శనార్థం వచ్చాయి. స్వామివారి పాదుకలు దర్శించుకోవడం మహద్భాగ్యమని పలువురు భక్తులు అన్నారు. దత్తాత్రేయుని అవతారం షిరిడీ సాయినాథుని ముందు అవతారంగా శ్రీసామ్రాట్ అక్కల తోట మహరాజ్ అని ప్రచారం ఉందని ఆయన గురించి పేర్కొన్నారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో కుంభాభిషేక పూజల్లో భాగంగా బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామస్తులు విరాళాలతో ఆలయాన్ని నిర్మించారు. కార్యక్రమంలో నాగబత్తిబాబు, నాగమురుగప్ప పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి, పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ నరసింహరావు ఆదేశించారు. బుధవారం ఆయన గ్రామ కార్యదర్శులు, ఉపాధి హామీ, గ్రామ సచివాలయాల సిబ్బందికి సమావేశం నిర్వహించి మాట్లాడారు. పరిష్కారానికి నోచుకోని సమస్యలుంటే తన దృష్టికి తేవాలన్నారు. ఏఓ త్రివిక్రమ్‌రావు, ఈఓపీఆర్‌డీ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణలు తొలగించాలని నోటీసులు

ఏర్పేడు: రోడ్డు ఆక్రమణలను తొలగించాలని దుకాణదారులకు బుధవారం సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యం నోటీసులు జారీ చేశారు. ఏర్పేడులో శ్రీకాళహస్తి-తిరుపతి, వెంకటగిరి-ఏర్పేడు రోడ్డుకు ఇరువైపులా దుకాణదారులు ఆక్రమించడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావు ఆదేశాలపై వారు స్పందించారు. ఆక్రమణలపై దృష్టి సారించి దుకాణదారులకు నోటీసులు జారీ చేశారు.

పుష్పయాగానికి అంకురార్పణ



పిచ్చాటూరు: నాగలాపురం శ్రీ వేదనారాయణ స్వామి ఆలయంలో బుధవారం పుష్పయాగానికి అంకురార్పణ చేశారు. ఆలయ మహామండపంలో మేదిని చిత్రపటాన్ని రూపొందించి విశ్వక్సేనుల వారి ఎదుట అర్చకులు ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి సర్వసేనాధిపతిని తిరుచ్చి వాహనంపై ఆసీనులు చేసి గ్రామంలో ఊరేగించారు.

అన్నీ తామై..

నారాయణవనం: మృతి చెందిన ఒంటరి మహిళకు అంత్యక్రియలు సాంప్రదాయబద్ధంగా చేశారు. వివరాలు.. స్థానిక దక్షిణమాడ వీధిలో వసుమతి(59) ఒంటరిగా నివసిస్తోంది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బుధవారం సాయంత్రం మృతి చెందింది. స్థానికుల సమాచారంతో మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డి, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, చిన్నదొరై స్పందించారు. దక్షిణ మాడవీధి వారితో చర్చించారు. వసుమతి బంధువులకు సమాచారమిచ్చినా ఎవరూ స్పందించకపోవడంతో బ్రాహ్మణుల సహకారంతో అంత్యక్రియలు చేశారు.

భక్తిప్రపత్తులతో గంగ జాతర



పిచ్చాటూరు: స్థానిక గంగజాతరలో భాగంగా బుధవారం రాత్రి అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. తొలుత ఉదయం అమ్మవారికి అంబలి పోశారు. గెరిగ ఉత్సవం నిర్వహించారు. సర్పంచ్, గ్రామపెద్దలు పర్యవేక్షించారు.

ఆర్బీకేలు.. రైతన్నలకు కల్పవృక్షాలు




బుచ్చినాయుడుకండ్రిగలోని రైతు భరోసా కేంద్రం, రైతులకు వైఎస్సార్ యంత్ర సేవా పథకం ట్రాక్టర్లు పంపిణీ చేస్తున్న అధికారులు (ఫైల్)

మట్టినే నమ్ముకున్న రైతన్నలు తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో సరైన సాయం అందక, అప్పుల ఊబిలో కూరుకుపోయారు. వ్యవసాయం దండగ అంటూ అప్పటి సీఎం చంద్రబాబునాయుడు ఈ రంగాన్ని చిన్నచూపు చూసి రైతాంగానికి మొండిచేయి చూపారు. పథకాల ఫలాలన్నీ జన్మభూమి కమిటీల పేరిట ఆ పార్టీ నాయకులే స్వాహా చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక రైతాంగ సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చింది. రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో రైతుల ముంగిటకే సేవలు అందుబాటులోకి తెచ్చి, వ్యవసాయ రంగం పరిపుష్టికి ఊతం ఇచ్చింది. ఫలితంగా రైతన్నల ఇంట వ్యవసాయ కాంతులీనుతున్నాయి.

- టీడీపీ పాలనలో వ్యవసాయానికి మొండిచేయి
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక రైతుల ముంగిటకే సేవలు
- వ్యవసాయం పరిపుష్టికి సీఎం చేయూత

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో మొత్తం 14 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా మొత్తం 9,730 రైతులు ప్రయోజనం పొందుతున్నారు. ఆర్బీకేలలో అన్నీ అందుబాటులో లభిస్తుండడంతో రైతన్నలు శ్రమ, కాలం వృథా కాకుండా అన్నీ పొందుతున్నారు. విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు, ఈ-క్రాప్ నమోదు, పంటలకు మద్దతు ధర, పొలంబడి ద్వారా రైతులకు శిక్షణ, టోల్ ఫ్రీ 155251 ద్వారా ముఖాముఖితో శాస్త్రవేత్తల సలహాలు-సూచనలు, భూసార పరీక్షలు, క్రిమి సంహారక మందులు..మొదలైనవన్నీనూ అందిస్తూ తమ పాలిట ఆర్బీకేలు కల్పవృక్షాల్లా ఉంటున్నాయని రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది.

మండలంలో ఆర్బీకే సేవలు

పంపిణీ చేసిన ఎరువులు : 468 మెట్రిక్ టన్నులు
ప్రస్తుతం అందుబాటులో : 150 మెట్రిక్ టన్నులు
కస్టమ్ హైరింగ్ గ్రూపులు : 14
పంపిణీ చేసిన వ్యవసాయ యంత్రాలు : 65
రైతులు పొందిన రాయితీ : రూ.35.60 లక్షలు
జనుముల విత్తనాలు : 100 క్వింటాళ్లు
జీలగ విత్తనాలు : 400 క్వింటాళ్లు
పిల్లి పెసర : 50 క్వింటాళ్లు
వైఎస్సార్ రైతు భరోసా కింద ఇచ్చిన మొత్తం : రూ.3.97కోట్లు
వైఎస్సార్ సున్నా వడ్డీ సాయం : 10 లక్షలు
77 మంది రైతులకు పంట నష్ట పరిహారం : రూ. 2.20 లక్షలు
ఈ-క్రాప్ బుకింగ్ రబీ సీజన్‌లో : 3,459 రైతులు 8,758 ఎకరాలు
ఈ క్రాప్ బుకింగ్ ఖరీఫ్‌లో : 1856 మంది రైతులు 5,206 ఎకరాలు
డ్రోన్ శిక్షణ : ముగ్గురు రైతులకు

ఈ-క్రాప్ నమోదుతో భరోసా



నేను మా పొలంలో వరి సాగు చేశాను. పంటకు రైతు భరోసా కేంద్రంలో ఈ-క్రాప్ నమోదు చేయించుకున్నా. ఒక వేళ వర్షాలు, ప్రకృతి విపత్తుల వల్ల పంట నష్టపోయినా ఈ-క్రాప్ నమోదు వల్ల ప్రభుత్వం పరిహారం ఇస్తుందనే నమ్మకం, భరోసా కలిగింది. రైతు భరోసా కేంద్రాల వల్ల మాకెంతో మేలు కలుగుతోంది. –చంద్రశేఖర్, రైతు, కంచనపుత్తూరు

తిరిగే బాధ తప్పిందయ్యా!



ఇంతకుముందు ఎరువులు, విత్తనాల కోసం బుచ్చినాయుడుకండ్రిగకు రావాల్సి వచ్చేది. వచ్చినా దొరికేవి కావు. ఆర్.అనంతాపురంలో రైతు భరోసా కేంద్రం పెట్టాక బుచ్చినాయుడుకండ్రిగకు వెళ్లే బాధలు తప్పిందయ్యా! వరి, వేరుశనగ పంటలకు కావాల్సిన యూరియా, డీఏపీ, 20:20 ఎరువులు ఇక్కడే తీసుకుంటున్నా. –వెంకటకృష్ణయ్య, రైతు, పెద్దపాలేడు

అందుబాటులో వ్యవసాయ యంత్ర పరికరాలు



నేను వరి, వేరుశనగ, మినుము పంటలు సాగు చేశా. పొలం దున్ని సాగు చేయడానికి కావాల్సిన నాగలి, గొర్రు, రోటావేటర్, పైపులు అన్నీ కూడా మా ఊరికి దగ్గరలోని రైతు భరోసా కేంద్రంలోని అధికారులను అడిగి తెచ్చుకొని పంటలు సాగు చేశా. వ్యవసాయానికి ఏం కావాలో అన్నీ ఆర్బీకేలలో తెచ్చుకుని చేస్తూండటం వల్ల వ్యవసాయ పనిముట్ల కోసం ఇబ్బందులు తప్పాయి. –నాగరాజు, రైతు, కనమనంబేడు

రైతాంగానికి విస్తృత సేవలు



రైతాంగానికి ఆర్బీకేలతో విస్తృత సేవలందిస్తున్నాం. ఎరువులు, పురుగుల మందులు, యంత్ర పరికరాలు మొదలైనవన్నీ వారికి అందుబాటులో ఉంచాం. గతంలోలా రైతులు నెలల తరబడి మండల కేంద్రం చుట్టూ తిరగాల్సిన పని లేదు. ఆర్బీకేలలోనే అన్నీ పొందుతున్నారు. –భారతి, వ్యవసాయాధికారిణి

చిన్నారులకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న ఎంపీడీఓ హరిబాబు

రేణిగుంట: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో విద్యార్థులకు బుధవారం ఎంపీడీఓ హరిబాబు చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేశారు. రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన 'చిలక చదువు' కథను నాటికగా వేసి విద్యార్థులు వీక్షకులను అలరించారు. అలాగే పలు పాటలు పాడి ఆకట్టుకున్నారు. ప్రతిభ చాటిన చిన్నారులు హాజీరా, గౌతమ్, రిజ్వాన్, ప్రణతిక, జగత్‌కు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఇలాంటి విజ్ఞాన శిబిరాలు పిల్లలో అభ్యసనాభిరుచిని పెంపొందిస్తాయని ఎంపీడీఓ అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజేశ్వరి, గ్రంథాలయాధికారిణి ఏ.శ్రీముఖి, బాలోత్సవ్ గౌరవాధ్యక్షులు దామోదరం, అధ్యక్షుడు నారాయణ, విద్యా వికాస వేదిక కన్వీనర్ ఓ.వెంకటరమణ, నరసింహారెడ్డి, సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఐఎఫ్‌ఎస్ అధికారి




ఐఎఫ్‌ఎస్ అధికారి నాగేశ్వరరావుకు జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ అధికారులు, సినీనటి దివి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం ఐఎఫ్‌ఎస్ అధికారి ఎస్.నాగేశ్వరరావు కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారుల సతీష్ మాలిక్, నాగభూషణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటిని దర్శించుకున్న సినీనటి దివి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం సినీనటి దివి దర్శించుకుంది. ఆలయ దక్షిణ గోపురం వద్ద పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆమెకు స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

పరశురామేశ్వరస్వామి సేవలో సీఐడీ ఐజీ



ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయంలో సీఐడీ ఐజీ సుశీల్ కుమార్ నాయక్ బుధవారం సాయంత్రం పూజలు చేశారు. ఆలయ పూజారులు ఆయనకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. అనంతరం శ్రీకాళహస్తికి వెళ్లారు.

పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించాలని..

శ్రీకాళహస్తి: బడిఈడు పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించాలని ప్రజాప్రగతి ట్రస్ట్ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్ కోరారు. బుధవారం మండలంలోని ముచ్చివోలు గిరిజనకాలనీ, ఎర్రగుడిపాడు గిరిజనకాలనీ, అక్కుర్తి గిరిజనకాలనీలో కరపత్ర ప్రచారం చేశారు. గ్రామస్తులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్పొరేట్ స్కూళ్లకన్నా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు, విలువలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు ఆయన గ్రామస్తులకు తెలిపారు. కార్యక్రమంలో అక్కుర్తి ప్రధానోపాధ్యాయులు దేవసేన, అంగన్‌వాడీ టీచర్ సుబ్బలక్ష్మి, అనూష, చాముండేశ్వరి పాల్గొన్నారు.

హర్ దిల్ మే వైఎస్సార్..



సమావేశమైన ముస్లిం నాయకులు

శ్రీకాళహస్తి: రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ ఖాదర్ బాషా సూచనలతో 'హర్ దిల్ మే వైఎస్ఆర్- వహ సబ్ జగన్ కే సద్' కార్యక్రమాన్ని బుధవారం శ్రీకాళహస్తిలో ముస్లింలు నిర్వహించారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని తిరుపతి జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ సిరాజ్‌బాషా ఆధ్వర్యంలో పట్టణంలోని మజీద్-ఏ-యసుఫ్ మజీద్ అధ్యక్షుడు షానవాజ్, కార్యదర్శి షబ్బీర్ ఇమామ్, మౌజాన్, కమిటీ సభ్యులను కలిసి వారికి మైనార్టీ ప్రచార కరపత్రాలు అందజేశారు. వారి సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



కాళమనాయుడుపేటలో సంక్షేమ బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు ఇస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు: ప్రజా సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. బుధవారం కాళమనాయుడుపేట, దళితవాడ, గాంధీపురం, నరసరాజు అగ్రహారం, గిరిజన కాలనీలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో ఆయన మాట్లాడారు. కాళమనాయుడుపేట పంచాయతీలో 296 కుటుంబాలు రూ.4.86 కోట్లు, నరసరాజు అగ్రహారం పంచాయతీలో 279 కుటుంబాలు రూ.3.42 కోట్లు వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందాయని వివరించారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

కాళమనాయుడుపేట, నరసరాజు అగ్రహారం, గాంధీపురంలో 40వేల లీటర్ల సామర్థ్యంతో నీళ్ల ట్యాంకులు నిర్మించాలని ఆ పంచాయతీల సర్పంచులు కోరారు. కాళమనాయుడుపేట దళితవాడలో టి.సుశీల రూ.6లక్షల మేరకు లబ్ధి పొందడంతో ఆమెను ఎమ్మెల్యే సన్మానించారు. సచివాలయం నుంచి గాంధీపురానికి చెరువు మార్గంలో వెళ్లే రోడ్డు వర్షాలకు రోడ్డు దెబ్బతిందని నివేదించారు. మండల గ్రాంటు కింద రోడ్డు ఆధునీకరణకు రూ.2లక్షలు మంజూరు చేయాలని ఎంపీడీఓ రమణకుమార్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. దళితవాడ, గిరిజన కాలనీలలో మురుగు కాలువలు నిర్మించాలని మహిళలు కోరారు. శ్మశాన వాటికకు మరి కొంత స్థలం కేటాయించాలని దళితులు విజ్ఞప్తి చేశారు. నరసరాజు అగ్రహారం గిరిజన కాలనీలో తాగునీటి పైపు లైను పొడిగించాలని, రోడ్డు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరారు.

గర్భిణులకు సీమంతం

కాళమనాయుడుపేట, నరసరాజు అగ్రహారం అంగన్ వాడీ కేంద్రాల పరిధిలో ఇద్దరు గర్భిణులు డిసి.మైథిలి, కె.స్వర్ణలతకు ఎమ్మెల్యే, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు సీమంతం చేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కే.సుశీల్ కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ పి.విజయలక్ష్మి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే. చంద్రశేఖర్ రెడ్డి, సురుటుపల్లె ఆలయ చైర్మన్ ఏపీఎం బాలాజీ రెడ్డి, సర్పంచులు టి.జయ(కాళమనాయుడుపేట) బాలాజీ(నరసరాజు అగ్రహారం), ఎంపీటీసీ మోహన్, వైద్యశాల కమిటీ సభ్యుడు గోవిందస్వామి, వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కే.శ్యాం ప్రసాద్ రెడ్డి.మాజీ ఎంపీటీసీ సురేష్‌కుమార్, సుబ్రమణ్యం,రాజారావు, హౌసింగ్ ఏఈ వెంకటసుబ్బయ్య, ఏపీఎం సర్వర్ణలత, ఎంఈఓ రవి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రథోత్సవంలో కల్యాణ వెంకన్న



రథోత్సవంలో ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఉభయ నాంచారులతో కల్యాణ వెంకటేశ్వరస్వామి రథోత్సవంలో భక్తులను అనుగ్రహించారు. రాత్రి అశ్వవాహనాన్ని అధిరోహించిన స్వామి మాడవీధుల్లో విహరించి, ఉభయ నాంచారులు, పద్మావతీ అమ్మవారితో కలిసి ఆర్జిత కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. వేకువ జామున సుప్రభాతసేవతో నిత్య పూజా కైంకర్యాల అనంతరం 5.30 గంటలకు దేవేరులతో కలిసి వెంకటేశ్వరస్వామి తిరుచ్చి వాహనంల్లో రథమండపానికి చేరుకుని 7 గంటలకు రథాన్ని అధిరోహించి వీధుల్లో విహరించారు. దక్షిణమాడవీధిలో అనారోగ్యంతో మహిళ మృతి చెందడంతో సంప్రోక్షణ తదితర కార్యక్రమాలను పూరి చేసి అశ్వవాహన సేవను రెండు గంటలు ఆలస్యంగా నిర్వహించారు. ఆర్జిత కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు తీర్థ ప్రసాదాలు, వస్త్ర బహుమానాన్ని అందజేశారు. టీటీడీ డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ మోహన్, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఇంజినీరింగ్ విభాగ అధికారులు పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పుత్తూరు రూరల్ సీఐ సురేష్ కుమార్ నారాయణవనం సర్కిల్ పరిధిలోని సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

రథోత్సవంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. ఉదయం 7.15 గంటలకు రథంపై స్వామిని దర్శించుకున్న ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆయన భక్తులతో కలిసి రథాన్ని లాగారు. కార్యక్రమంలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు చిన్నదొరై, మోహన్, ధర్మలింగం, గోవిందశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా 'సంకట చతుర్థశి'



హోమం చేస్తున్న వేద పండితులు, అంజూరు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజి అంజి వినాయకస్వామి ఆలయం వద్ద బుధవారం ఆగమోక్తంగా సంకట చతుర్థశి పూజలు చేశారు. ఈ పూజలను ప్రతి కుటుంబం చేసుకునేలా పాలకమండలి దీనిని ఆర్జిత సేవగా తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలో అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేకం నిర్వహించి విశేషంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ అధికారులు, వేదపండితులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సిపాయి భరోసా పంపిణీ



నిత్యావసర సరకులు అందజేస్తున్న సిపాయి

ఏర్పేడు: మండలంలోని దుర్గిపేరిలో ఇటీవల దొడ్డి కృష్ణారెడ్డి(50) మృతి చెందాడు. బుధవారం మృతుడి కుటుంబాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పరామర్శించారు. సిపాయి భరోసా పథకం కింద ఏడాదికి సరిపడా 40 రకాల నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బాబూరావు, సర్పంచ్ మునిరామయ్య, మాజీ సర్పంచ్ మునిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటస్వామి, సునీల్, బత్తెమ్మ, పద్మమ్మ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు ఎమ్మెల్సీ సిపాయి పూజలు

శ్రీకాళహస్తి: మండలంలోని వేడాంమిట్టకండ్రిగలో గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం అమ్మవారి పూజలకు హాజరై దర్శించుకున్నారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని, వర్షాలు పుష్కలంగా కురిసి రైతులకు మేలు కలగాలని మొక్కినట్లు తెలిపారు. ఆయనకు మాజీ వైస్ ఎంపీపీ స్వాగతం పలికారు. కార్యక్రమంలో రత్నంరెడ్డి, పెరుమాల్‌రెడ్డి, తొట్టంబేడు మాజీ జెడ్పీటీసీ వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటోందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. బుధవారం కాళమనాయుడుపేట ప్రాథమిక పాఠశాల ఆవరణలో వైఎస్సార్ రైతుభరోసా-పీఎం కిసాన్ పథకం చెక్కును రైతులకు అందజేసి ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వ్యవసాయం పండుగలా మారిందన్నారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి విత్తనాలు, ఎరువులు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి మురళి, ఎంపీడీఓ రమణకుమార్, వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కే.శ్యాంప్రసాద్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కే. సుశీల్‌కుమార్ రెడ్డి, వీఏఏ స్వర్ణ, ఏడీ గోవిందరాజ భాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ రవి కుమార్, సర్పంచులు టి.జయ, బాలాజీ, ఎంపీటీసీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పనులకు ప్రాధాన్యత



మాట్లాడుతున్న ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): మండలంలోని 27 పంచాయితీలలో తాగునీటి పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సర్పంచ్‌లు పలు సమస్యలు ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినా వాటికి ఆన్, ఆఫ్ స్విచ్‌లు బిగించకపోవడంతో ఎల్‌సీ తీసుకొనే లోపు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని తెలిపారు. అలాగే ఉపాధి హామీ పనులలో ఎక్కువగా రైతులకు ఉపయోగపడే పంట కాలువలు, పూడికతీత చేయాలని కోరారు. పొయ్యి పంచాయతీలోని శ్మశానం స్థలం హైవే పనులకు సేకరించడంతో తిరిగి శ్మశానానికి రెవెన్యూ అధికారుల స్థలం కేటాయించాలని కోరారు. అలాగే మండలంలోని శ్మశానవాటికల్లో బోర్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు గెరటారెడ్డి, మల్లికమ్మ, ఎంపీడీఓ తరుణాక్షి రెడ్డి, వివిధ అధికారులు, సర్పంచులు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఉన్నం వాసు నాయుడు పాల్గొన్నారు.